ప్రజాశక్తి

మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

అతిథి పక్షులకు కరువు స్వాగతం

అడుగంటిన వీరాపురం, వెంకటాపురం చెరువులు
కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం
కనుమరుగవుతున్న పర్యాటక కేంద్రం ఆనవాళ్లు

నీరు లేక ఎండిన వెంకటాపురం చెరువు

ఆ పక్షుల కిలకిల రావాలు ఆకలి కేకలు కానున్నాయి.! గతంలో సైబీరియన్ పక్షులతో కళకళలాడే చెట్లపై ఆకలి తీరక వాటి గూళ్లలోనే కబేళాలతో వేలాడుతున్న పక్షి ఆకారాలు కంటికి కనపడతాయోమోనని గ్రామస్తులు కలవరపడుతున్నారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఇక్కడికి వచ్చే విదేశీపక్షులు ఇక్కడే ఉండి మే, జూన్ నెలల్లో గుడ్లు పెట్టి, పిల్లలకు జన్మనిస్తాయి. దాదాపు ఏడెనిమిది నెలల పాటు ఇక్కడే ఉండే ఈ అతిథి పక్షులు వచ్చాయన్న సంతోషం కన్నా అవి ఈ కరువు కాలంలో పడే కష్టాలను ముందుగానే ఊహించుకుంటున్న వీరాపురం, వెంకటాపురం గ్రామాలు చింతలోపడ్డాయి.

ప్రజాశక్తి - చిలమత్తూరు

గత మూడేళ్లుగా కుండపోత వర్షాలతో చెరువులు పొంగిపొర్లాయి. చెట్లు పచ్చదనపు సోయగాలతో దర్శనం ఇచ్చాయి. ఆ మూడేళ్లల్లో పక్షుల రాక అధికంగా పెరిగిపోయింది. అయితే ఈ ఏడాది వర్షపాతం ఏ మాత్రం లేకపోవడంతో చెట్లు ఎండుముఖం పట్టాయి. చెరువులలో నీరు అడుగంటాయి. ఈసారి ఈ విదేశీపక్షులు అధికంగా వచ్చినా వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

కనీస సౌకర్యాలు కరువు

పర్యాటక కేంద్రాలలో ఒకటైన వీరాపురం పక్షుల కేంద్రం. ప్రభుత్వాలు కనీస నిధులు కేటాయించకపోవడం కనీస సౌకర్యాలు కల్పించకపోవడం కారణంగా ఈ పర్యాటకకేంద్రం రోజు రోజుకు కనుమరుగవుతున్న పరిస్థితి నెలకొంది. పర్యాటక శాఖ గాని, అటవీశాఖ గాని పట్టించుకున్న పాపానికి పోలేదు. ఇక ఈ పక్షులకి ఏ మాత్రం రక్షణ లేదు. పక్షులు అధికంగా వస్తున్నప్పటికీ వాటి కోసం చెరువులలో నీటిని నింపడం గాని వాటిలో చేపలు పెంపకం చేపట్టి ఆహారాన్ని అందించడం వంటి కార్యక్రమాలు గాని ఏ మాత్రం చేపట్టడం లేదు. మండలం మీదుగా హంద్రీనీవా కాలువ పోతున్న కనీసం ఈ పంచాయతీ చెరువులకు కూడా నీటిని అందించలేని దుస్థితి నెలకొంది. కనీసం నీటి తొట్టెలు నిర్మాణం చేసి దాహం తీర్చే పనికాని, ఫీడ్ అందించే పని కాని ప్రభుత్వ అదికార యంత్రాంగం చేపట్టడం లేదు.

పేరుకే పర్యాటక కేంద్రం... పర్యాటకుల తాకిడి శూన్యం

మరవకొత్తపల్లి క్రాస్ వద్ద అలంకార ప్రాయంగా పక్షిబొమ్మలకు రంగు వేయడమే తప్ప వీరాపురంలో అభివృద్ధి చేసింది శూన్యం. ప్రపంచ పర్యాటక కేంద్రంలో ఒకటైన లేపాక్షికి వచ్చే ప్రతి పర్యాటకుడు తప్పనిసరిగా చూడాల్సిన మరో ప్రదేశం వీరాపురం పక్షుల కేంద్రం. గత పదేళ్ల క్రితం పర్యాటకులు అలా వచ్చి పకృతి వడిలో చెట్లపై, చెరువుల్లో పెద్ద పెద్ద రెక్కలతో పొడవాటి కాళ్లతో ఎరుపు పసుపు కలబోసిన పొడగాటి ముక్కుతో కనువిందు చేసే పక్షులను చూసి కాసేపు అలా మైమరచిపోయేవారు. ఆయా గ్రామాలు పర్యాటకుల తాకిడితో నిండిపోయేవి. వీరాపురం గ్రామం ఎప్పుడు వార్తల్లో నిలిచేది. కాని ఇప్పుడు పరిస్థితి అలా లేదు. ఏదైన పకృతి విపత్తు జరిగితేనో లేక కరువు వస్తేనే వార్తాలలో నిలుస్తుంది తప్ప పర్యాటకుల తాకిడి పూర్తిగా తగ్గి పోయింది. కనీస సౌకర్యాలు లేకపోవడం అవసరమైన స్థాయిలో ప్రచారం, ప్రభుత్వ సాయం, ప్రోత్సాహం కల్పించకపోవడం కారణంగా పర్యాటక కేంద్రం కాస్తా సమస్యల కేంద్రంగా మారింది. ఈ గ్రామాల్లో కనీస డ్రైనేజీలు లేక రోడ్డుపైన మురుగునీరు చేరి వెనుకబడ్డ గ్రామాలలో ఉన్నామన్న అనుభూతి పర్యాటకుల్లో పెరిగిపోవడంతో రానురాను పర్యాటకుల తాకిడి తగ్గిపోయింది. ఇప్పుడు పూర్తీ స్థాయిలో పర్యాటకుల రాక తగ్గిపోయింది.

గతేడాది పకృతి ప్రకోపానికి, ఈసారి కరువుకు బలైన పక్షులు

గతేడాది అకాల వర్షం, గాలీవాన భీభత్సంతో పదుల సంఖ్యలో పక్షులు మృత్యువాత పడ్డాయి. అనేక పక్షులు అవిటివి అయ్యాయి. అనేక చెట్లు కొమ్మలు విరిగి నేలకొరిగాయి. ఘటన స్థలాన్ని సందర్శించిన అధికారులు ప్రజా ప్రతినిధులు ధూం.. ధాం అన్నారు. ఈ పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేసి ఆకాశం అంచున ఉంచుతామని, ఒక పక్షి ప్రాణం పోవడానికి కూడా వీల్లేదని ప్రగల్బాలు పలికారు. కాని ఆరు నెలల కాలంలో కనీసం వీరి సందర్శనలు కూడా లేవు. ఈ ఏడాది కరువు దెబ్బకు వీరాపురం, వెంకటాపురం చెరువుల్లో నీరు పూర్తిగా ఇంకిపోయాయి. పక్షుల రాక పెరిగినా వాటికి కనీస సౌకర్యాలు, వసతి లేకపోవడంతో వెనుతిరిగే పరిస్థితులు నెలకొన్నాయి. మూడేళ్ల క్రితం ఆహారం లేక చెట్ల గూళ్లలో తనువు చాలించిన పక్షుల కళేబరాలు కంటపడ్డ దృశ్యాలు పునారావృతం అవుతాయేమో అని గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు.

రోడ్డుపక్కన ఆకర్షనీయంగా పక్షి బొమ్మ ఏర్పాటు చేసి రంగులు వేసిన దృశ్యం

గత ఏడాది గాలీవాన భీబత్సానికి చనిపోయిన విదేశీ పక్షులు(ఫైల్ ఫొటో)

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

వీరాపురం పక్షుల కేంద్రం రాను రాను కనుమరుగవుతున్న పరిస్థితి నెలకొంది. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంలో పాలకపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయి. గతేడాది అతివృష్టి కారణంగా అల్లాడిన విదేశీ పక్షులు ఈ ఏడాది అనావృష్టి కారణంగా ఎలాంటి కష్టాలు పడతాయో. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ముందస్తుగా కనీస అవసరాలైన నీరు, ఆహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలి. చెరువులను నీటితో నింపాలి. లేదా తాత్కాలికంగా తొట్టెలు నిర్మించి చేపలు పెంపకం చేసి పక్షులకు ఆహారం అందజేయాలి. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి.

సుధాకర్,
సిపిఎం నాయకులు

పక్షుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

ఈ ఏడాది పూర్తి స్థాయిలో చెరువులలో నీరు అడగంటాయి. గత మూడు సంవత్సరాలుగా నీటి సమస్య లేదు. ఇప్పుడు నీటి సమస్య తీవ్రంగా ఉంది. హంద్రీనీవా కాలువ తీసుకొచ్చి చెరువులు నింపుతామని గత 8 ఏళ్లుగా చెబుతూనే ఉన్నారు కాని ఇంత వరుకు ఆ ప్రతిపాదనే లేదు. నీరు లేని కారణంగా పక్షులు సుమారు 20 కిలోమీటర్లు ప్రయాణించి లేఎలాక్షి హిందూపురం చెరువులకి వెళ్లాల్సి వస్తుంది. అక్కడ కూడా నీరు కొద్దిగానే ఉన్నాయి. ఇక నీరు లేక ఆహారం లేక పక్షులు ఈ ఏడాది అల్లాడనున్నాయి. అధికారులు తగిన ఏర్పాట్లు చేసి పక్షులను సంరక్షించే బాధ్యత తీసుకోవాలి

వెంకటేష్,
వెంకటాపురం యువకుడు

సీజన్ ముగిసే లోపే పంట నష్ట పరిహారం

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే పరిహారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందనిజిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్చువల్ విధానంలో బటన్ నొక్కి పంట నష్టపరిహారాన్ని విడుదల చేశారు. కలెక్టరేట్ లో కలెక్టర్ తో పాటు శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, పుడా చైర్పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్లు లక్ష్మి నారాయణ రెడ్డి, తిప్పన్న, వ్యవసాయ అధికారి సుబ్బారావు, రైతులు ఈ దృశ్యాలను తిలకించారు. అనంతరంకలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,17,000 మంది రైతులకు రూ. 105.03 కోట్ల పరిహారం అందుతున్నట్లు తెలిపారు. ఖరీఫ్ 2023 సంవత్సరానికి సంబంధించి వర్షాభావ పరిస్థితుల వల్ల పంట నష్టపోయిన రైతాంగానికి జిల్లాలో ప్రకటించిన 21 కరువు మండలాల రైతులకు ఇన్‌పుడ్ సబ్సిడీని అందజేయడం కోసం గతంలో ప్రభుత్వం నిర్ణయం మేరకు చర్యలు తీసుకుని నేడు ఆ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని వివరించారు. ఏ సీజన్లో పంట నష్టానికి ఆ సీజన్ ముగిసే లోగానే పెట్టుబడి రాయితీని ప్రభుత్వం విడుదల చేస్తున్న తరుణంలో రైతులు పంట నష్ట పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతులకు మెగా చెక్కు ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమల శాఖ జేడీ పద్మమ్మ, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, ఎపిఎంఐపి పీడీ సుదర్శన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నికల్లో అధికారులు వారికి కేటాయించిన విధులను చట్టబద్ధతతో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల అధికారి అభిషేక్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యలయంలో సార్వత్రిక ఎన్నికల కోసం నియమించబడిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతు అప్పంగించిన అంశాలకు సంబంధించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఉత్తర్వుల మేరకు చేపడుతున్న కార్యకలాపాలు సమర్థవంతంగా చేయాల్సి ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడు ఎలక్షన్స్ సెల్‌తో సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు. ఇప్పటికే అధికారులకు కేటాయించిన విధుల మేరకు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు. ఎన్నికల విధులను సక్రమంగా చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఎన్నికల అధికారి రెడ్డి శేఖర్, ఎసిపి సునీల్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కమిషనర్ తీరుకు నిరసనగా పారిశుధ్య కార్మికుల ఆందోళన

హిందూపురం : హిందూపురం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి తీరును నిరసిస్తూ సిఐటియు ఆద్వర్యంలో పారిశుధ్య కార్మికులు బుధవారం విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. పట్టణంలోని ఇందిరా పార్కు నుంచి వైసిపి కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి కార్యాలయం ముందు బైటాయించారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టూటౌన్, అప్ గ్రేడ్ స్టేషన్ సిఐలు అక్కడికి చేరుకుని ఆందోళన విరమించాలని, సమస్యలను మున్సిపల్ కార్యలయంలో పరిష్కరించుకోవాలని నాయకులను కోరారు. దీంతో సిఐటియు జిల్లా కోశాదికారి సాంబశివ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు సమస్యలను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణు రెడ్డి అక్కడికి చేరుకుని నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు కరోన సమయంలో దిన సరి వేతనం కింద తీసుకున్న 85 మంది కార్మికులకు వేతనం పెంచుతామని, పట్టణ విస్తరణ, జనాబాకు అనుగుణంగా మరో 15 మంది కార్మికులను దిన వేతనం కింద తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. దీంతో పాటు కార్మికులకు అవసరమైన పని ముట్లు ఇవ్వాలని అడిగితే ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. దీంతో వేణురెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డితో ఫోన్ లో చర్చించి, సమస్యలను పరిష్కరించడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లికార్జున, ఆనంద్, గురునాథ్, పరమేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వంట గ్యాస్‌పై అదనంగా వసూలు చేస్తే చర్యలు : జెసి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

వంట గ్యాస్ సిలిండర్‌పై వినియోగదారుల బిల్లులో ఉన్న మొత్తం కంటే అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణరెడ్డితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్లు, ఐఒసి, హెచ్‌పిఎల్, బిపిసి గ్యాస్ ఏజెన్సీల యాజమాన్యాలు, సేల్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు. జెసి మాట్లాడుతూ గ్యాస్ డెలివరీ బాయ్స్ వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదనంగా వసూలు చేస్తే వినియోగదారులు జిల్లా పౌరసరఫరాల అధికారి లేదా సంబంధిత ఏజెన్సీ యాజమాన్యానికి ఫిర్యాదు చేయాలని సూచించారు.

వేసవి కష్టాలు



- మార్చిలోనే మండుతున్న ఎండలు
- రాష్ట్రంలోనే 'అనంత' గరిష్టం
- 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మార్చి మొదలుతోనే అనంతపురం జిల్లాలో ఎండలు మండుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు అనంతపురం జిల్లాలో వరుసగా నమోదవుతూ వస్తున్నాయి. ఎండల తీవ్రతను జనం మధ్యాహ్నం సమయాల్లో బయటకు రావాలంటే జంకుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఒక మహిళ వడదెబ్బకు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. హిందూపురం మండలం సడ్లపల్లిలో మంగళవారం రేషన్‌షాపునకు వెళ్లిన ఒక మహిళ వడదెబ్బతో మృత్యువాత పడింది. వేడి తీవ్రత పెరగడంతో వేసవి కష్టాలు మొదలయ్యాయి. కొన్ని చోట్ల తాగునీటి కష్టాలు రాగా, మరికొన్ని చోట్ల విద్యుత్ కష్టాలు పెరిగి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్రంలోనే అత్యధికం

ఎండ తీవ్రత రాష్ట్రంలోనే అత్యధికంగా అనంతపురం జిల్లాలో నమోదయింది. బుధవారం 40.03 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఇది రాష్ట్రంలోని అన్ని జిల్లాలో కంటే అధికంగా ఉండటం గమనార్హం. అంతకు మునుపు ఐదవ తేదీన 39.9 డిగ్రీలు, నాలుగో తేదీన 39.11 డిగ్రీలు ఇలా వరుసగా మూడు రోజులు అనంతపురం జిల్లాలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్న సమయాల్లో వడగాల్పులు సైతం ఉంటుండటంతో రోడ్లపై జనసంచారం తక్కువగా ఉంటోంది. మార్చిలోనే ఈ పరిస్థితులుంటే ఏప్రిల్, మే మాసాలు వచ్చే సరికి మరింత తీవ్రమవుతాయేమోనని జనం భయపడిపోతున్నారు. వేసవిలో శీతాలాన్ని అందించే ఎసిలు, ఫ్రిడ్జ్‌లు, కూలర్లకు గిరాకీ పెరిగింది. అన్ని ఎలక్ట్రానిక్ షాపుల్లోనూ వీటి కొనుగోళ్ల సాధారణం కంటే పెరిగాయి.

వేసవి కష్టాలు మొదలు

వేసవి కాలం మొదలయిందో లేదో కరెంటు కష్టాలు మొదలయ్యాయి. ప్రధానంగా వ్యవసాయరంగానికికోతలు పెరుగుతున్నాయి. రోజుకు తొమ్మిది గంటల విద్యుత్ అని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆచరణలో ఇప్పుడు ఏడు గంటలకు వచ్చేసింది. 2023 వర్షాభావానికి తోడు విద్యుత్ సమస్య పెరగడంతో పంటలను రక్షించుకునేందుకు రైతులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల విద్యుత్ కోతలపై నిరసనలు సైతం చేపడుతున్నారు. ఇక తాగునీటి కష్టాలు పెరుగుతున్నాయి. సత్యసాయి జిల్లాలో సుమారు వందకుపైగా గ్రామాల్లో ఇప్పటికే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతపురం జిల్లాలో గుత్తి, కళ్యాణదుర్గం ప్రాంతాల్లోనూ తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసనలు చేపట్టారు. ప్రారంభంలోనే ఈ పరిస్థితులుంటే వచ్చే ఏప్రిల్, మే నెలల్లో మరింత తీవ్రమవుతాయన్న ఆందోళన ప్రజల్లో ఉంది.

నాగరాజు మృతదేహం వద్ద నాయకుల నివాళి

వైసిపి కౌన్సిలర్ భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలోని 34వ వార్డు వైసిపి కౌన్సిలర్ నాగమణి భర్త నాగరాజు ఆత్మహత్య చేసుకున్నాడు. అందుకు సంబందించిన వివరాలు... కౌన్సిలర్ నాగమణి భర్త నాగరాజు మంగళవారం మధ్యాహ్నం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నం చేశారు. వెంటనే కుటుంబ సభ్యులు గుర్తించి ఉప్పు నీళ్లు తాగించి ప్రధమ చికిత్స అందించారు. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న నాగరాజు బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. అయితే ఇతని ఆత్మహత్య వెనుక కారణాలు కుటుంబ సభ్యులు వెల్లడించలేదు. తాగుడుకు బానిసై మద్యంతో కలిసి క్రిమిసంహారక ముందు తీసుకున్నట్లు భార్య నాగమణి, కుటుంబ సభ్యులు చెబుతున్నారు. విషయం తెలిసిన వెంటనే వైసిపి ఇన్చార్జి దీపిక భర్త వేణు రెడ్డి ప్రభుత్వాసుపత్రికి వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కౌన్సిలర్ నాగమణికి ఆర్థిక సహాయాన్ని అందించి, ధైర్యం చెప్పారు. ఈ మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన వైస్ చైర్మన్లు

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరిటెండెంట్ రోహిల్ కుమార్, వైద్యుల తీరుపై మున్సిపల్ వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జిబివుల్లా, పలువురు కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్య వ్యవస్థను పటిష్టం చేస్తుంటే, స్థానికంగా ఉన్న వైద్యులు వారు నిర్వహించే విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఒక ప్రజా ప్రతినిధి భర్తకే వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులు, ఇక సామాన్యులకు ఏమాత్రం వైద్య సేవలు అందిస్తున్నారు అర్థమవుతుందని అన్నారు. ఆసుపత్రి మెడికల్ సూపరిటెండెంట్ రోహిల్ కుమార్ కు పదిసార్లు ఫోన్ చేసినప్పటికీ ఆయన స్పందించలేదని, ఆయన కార్యాలయంలోకి వెళ్ళినప్పటికీ తమది తప్పే లేదన్నట్టు నిర్లక్ష్యంగా మాట్లాడారని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించాలని పోలీసు శాఖ లేఖ ఇచ్చి కోరినప్పటికీ సకాలంలో చేయలేదని, కనీసం ఏ సమయానికి చేస్తారన్న విషయాన్ని సైతం చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరం కలిసి ఆందోళన చేయడానికి సిద్ధం కావడంతో, వెంటనే పోస్టుమార్టం నిర్వహించడానికి వైద్యుని నియమించి, పోస్టుమార్టం నిర్వహించారన్నారు. అధికార ప్రతిపక్ష నాయకులతోపాటు, పలువురు కౌన్సిలర్లు మతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

8న రాష్ట్రస్థాయి ఖాదీ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని రైల్వే స్టేషన్ లోని రైల్వే కమ్యూనిటీ హాల్ లో ప్రధానమంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం (పిఎంఇజిపి) ఆధ్వర్యంలో ఈనెల 8న రాష్ట్రస్థాయి ఖాదీ, గ్రామ ఉద్యోగ్ ఉత్పత్తుల అమ్మకాల ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆశాఖ రాష్ట్ర డైరెక్టర్ డా.ఎస్.గ్రీప్ తెలిపారు. ఈ మేరకు ఆయన విజయవాడ నుండి ఒక ప్రకటన విడుదల చేశ్వారు. ఈ రాష్ట్ర స్థాయి ఎగ్జిబిషన్ లో వివిధ రాష్ట్రాల నుండి 60 కి పైగా స్టాల్స్ పాల్గొననున్నట్లు తెలిపారు. చేతివృత్తుల వారికి జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచడం కోసం ఏర్పాటు చేస్తున్న ఈ ఎగ్జిబిషన్ లో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

ఓటరు జాబితాలో అవకతవకలపై ఫిర్యాదు

ధర్మవరం టౌన్ : నియోజకవర్గంలో ఓటరు జాబితాలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ మద్దతుదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవా రం నాయకులు రాప్తాటి రాము, నబిరసూల్, నారాయణస్వామి యాదవ్ ఆర్‌డిఒ వెంకటశివారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ధర్మవరం పట్టణంతో పాటు బత్తలపల్లి మండలం అప్రాచెరువు గ్రామంలో ఉన్న డబుల్ ఓట్లను గుర్తించి ఆర్‌డిఒకు వివరించారు.

9న 'వికలాంగుల మహాగర్జన'

ధర్మవరం టౌన్ : ఈ నెల 9వ తేదీ అమరావతిలో నిర్వహిస్తున్న వికలాంగుల మహాగర్జనకు తరలిరావాలని మహాజన సోసలిస్టు పార్టీ ధర్మవరం ఇన్‌ఛార్జి బూదెప్ప పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని జగ్జీవన్‌రాం విగ్రహం ఎదుట మహాగర్జన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వికలాంగుల పింఛను రూ. 6వేలు, అంత్యోదయ కార్డులు, 5 శాతం రిజర్వేషన్, తదితర సమస్యలపై మహాగర్జన కు పిలుపునిచ్చామని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో అయ్యప్పరెడ్డి, బాషా, నారాయణమ్మ, రామాంజనేయులు, గజ్జల రామాంజనేయులు, సాకే చెన్నమ్మ, పూజారి పెద్దన్న, యాదగిరి, అవినాశ్, రామక్రిష్ణ, పుల్లన్న, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ముస్లిం ఉద్యోగులకు మినహాయింపు

కొత్తచెరువు : రంజాన్ మాసంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, డైట్ కళాశాల, ఎంఇఒ కార్యాలయాలు, సమగ్ర శిక్షా కార్యాలయంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, బోధన సిబ్బందికి ప్రభుత్వం 1 గంట మినహాయింపు ఇచ్చినట్లు డిఇఒ మీనాక్షి తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా మార్చి 11 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకూ మసీదుకు వెళ్లే ముస్లింలు 1 గంట ముందు గానే వెళ్లవచ్చు అన్నారు.

పోలింగ్ కేంద్రం మార్చొద్దని వినతి

తలుపుల : మండలంలోని ఎర్రసానివారిపల్లి గ్రామంలో ఏళ్లుగా ఉంటున్న పోలింగ్ కేంద్రాన్ని కొరుగుట్టపల్లి గ్రామానికి తరలించడం హేమమైన చర్య అని గ్రామస్తులు మండిపడ్డారు. పోలింగ్ కేంద్రం మార్చొద్దని గ్రామంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌ఐ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో అన్ని సౌకర్యాలు ఉన్నా పోలింగ్ కేంద్రం మార్చడం తగదన్నారు. అధికారులు పోలింగ్ కేంద్రాన్ని మారిస్తే ఎన్నికలకు దూరంగా ఉంటామన్నారు.

పండ్ల మొక్కలకు దరఖాస్తు చేసుకోండి

గాండ్లపెంట : పండ్ల మొక్కలు అవసరమైన రైతులు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని బుధవారం ఎంపిడిఒ కె.రామానాయక్, ఎపిఒ మంజునాథ్ తెలిపారు. వారు మాట్లాడు తూ ఉపాధి హామీ చట్టం కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి చిన్న, సన్నకారు రైతులు పండ్ల మొక్కల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు రైతులకు తెలియజేయా లన్నారు. రైతు పట్టాదారు పాసుబుక్కు, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు, సెల్ నెంబర్ జిరాక్స్ జత చేసి దరఖాస్తు చేసుకోవా లన్నారు.

అబాకస్‌లో ధర్మవరం విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం టౌన్ : విశ్వం ఎడ్యుకేట్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పిన్నాకిల్ వేదిక్ మ్యాథ్స్ జిల్లా లెవెల్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పట్టణంలోని పిసిఎంఆర్ పాఠశాల ఛైర్మన్ హర్షవర్ధన్, డైరెక్టర్ రూపారాజ్యలక్ష్మి, ప్రిన్సిపల్ నరేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్టార్ జూనియర్ లెవెల్-3లో ఆసియా(2వ తరగతి) ప్రథమ, సీనియర్ లెవెల్-2లో సాయి సమిత(5వ తరగతి) ద్వితీయ, స్టార్ జూనియర్ లెవెల్-1లో ఉష్ణశ్రీ(1వ తరగతి) తృతీయ బహుమతులు సాధించారు. దీని ఛైర్మన్, డైరెక్టర్, ప్రిన్సిపల్‌తో పాటు కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, జగదీష్, ఉపాధ్యాయ బృందం, బోధనేతర సిబ్బంది అభినందించారు.

11న మంగళకర కళాశాల ముట్టడి

పుట్టపర్తి రూరల్ : విద్యార్థులను వేధించిన అధ్యాపకులపై పోక్సో కేసు నమోదు చేయాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని, మంగళకర కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వారు బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళకర కళాశాలను ముట్టడిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మంజుల నరేంద్ర, పోతులయ్య, మూర్తి, చైతన్య, పవన్, గిరి పాల్గొన్నారు.

10న వైసిపి 'గిరిజన జనగర్జన'

కదిరి టౌన్ : పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఈ నెల 10వ తేదీ నిర్వహిస్తున్న వైసిపి గిరిజన జనగర్జన మహాసభను నియోజకవర్గంలోని పాటు జిల్లాలోని ప్రతి గిరిజనుడు హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ సమన్వయకర్త బిఎస్.మక్బుల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన పట్టణంలోని తన కార్యాలయం లో జిల్లా గిరిజన జనగర్జన మహాసభ పోస్టర్లను ఆవిష్క రించారు. కార్యక్రమంలో దుంగావత్ రమేష్ నాయక్, కుల్లాయప్ప నాయక్, తిరుపాల్ నాయక్, ఒబిసి జయరామ్ నాయక్, సర్పంచులు చలపతినాయక్, రమణానాయక్, నాయకులు భూక్య కృష్ణానాయక్, రవినాయక్, వైస్ ఎంపిపి ఆనంద నాయక్, ఉప సర్పంచి వసంతనాయక్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

టిడిపి సర్పంచికి పరామర్శ

పెనుకొండ : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రొద్దం మండలంలోని బీదానపల్లి టిడిపి సర్పంచి మంజుల బుధవారం జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి పరామర్శించారు. అనంతరం బికె పోలీస్ స్టేషన్ వెళ్లి బీదానపల్లి గ్రామంలో గ్రామకంఠం ఆధ్వర్యంలో ఉన్న చింత చెట్లను వైసిపి నాయకులు నరికివేస్తుండగా అడ్డుకో బోయిన సర్పంచి మంజులపై దాడి చేశారని, వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల నిర్వహణలో అధికారులదే కీలక పాత్ర : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎన్నికల నిర్వహణ, విజయవంతం చేయడంలో అధికారులదే కీలకపాత్ర అని ఆర్‌డిఒ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ వెంకటశివరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్‌డిఒ సమా వేశ భవనంలో బుధవారం ఎన్నికల విధి విధానాలు, బాధ్యతలు, విధులు, ఈవీఎం, కంప్యూటర్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ వినియోగంపై శిక్షణ తరగతులు, అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచించిన నియమ, నిబంధనలు తప్పక పాటించాలన్నారు. పొరపాట్లకు తావు లేకుండా, అందరి సహాయ సహకారాలతో ఎన్నికలు సజావుగా నిర్వహించా లన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామ్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, తహశీల్దార్లు రమేష్, నజుమాబాను, సరస్వతి, శివశంకరనాయక్, 16 మంది సెక్టార్ ఆఫీసర్లు, 16 మంది సెక్టార్ పోలీస్ ఆఫీసర్లు, 18

బత్తలపల్లిలో ఎన్నికల విధులపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌డిఒ

మంది సూపర్వైజర్లు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై వీడియో కాన్ఫరెన్స్

పుట్టపర్తి రూరల్ : ఎన్నికల నియమ నిబంధనలు, ఓటర్ల జాబితా సవరణపై బుధవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల అధికారులు ఆర్‌డిఒ, పుట్టపర్తి నియోజక వర్గంలోని తహశీల్దార్లు, బిఎల్‌ఒలు, సూపర్వైజర్లకు పలు సూచనలు చేశారు. జనవరి 6వ తేదీ నుంచి వచ్చిన ప్రతి అప్లికేషన్, దరఖాస్తును విచారణ చేసి, అర్హులను ఓటరు జాబితాలో నమోదు చేయాలన్నారు. జీరో డోర్ నెంబర్లు, మార్పులు, చేర్పులు ఉంటే సరి చేయాలన్నారు. చనిపోయిన, బదిలీ అయిన, డబుల్ ఎంట్రీ ఓట్లను గుర్తించి తొలగించాలన్నారు. ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ భాగ్యరేఖ, డిఎఒ వెంకటస్వామి, తహశీల్దార్లు నాగభూషణ, వేణుగోపాల్, తరుణ్‌తేజ, మనోజ్‌కుమార్‌రెడ్డి, రహిమాన్, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటింగ్ ప్రక్రియ

బత్తలపల్లి : ఎన్నికల్లోల ఓటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌డిఒ వెంకట శివరామిరెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లోని సెక్టోరియల్ అధికారులు, సూపర్వైజర్లు, బిఎల్‌ఒలకు ఈవీఎంలు, ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాక్ పోలింగ్, ఓటర్ల జాబితా, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో తహశీల్దార్లు మూర్తి, శివశంకర్‌నాయర్ పాల్గొన్నారు.

టిడిపిలోకి ధైర్యంగా చేరండి : పరిటాల సునీత

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

టిడిపిలోకి ఎవరైనా సరే ధైర్యంగా రావాలని అండగా ఉంటామని మాజీ మంత్రి పరిటాల సునీత భరోసా ఇచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం మండలంలోని కనుముక్కల గ్రామానికి చెందిన 10 కుటుంబాలు సునీత సమక్షంలో టిడిపిలో చేరాయి. వైసిపి నాయకులు బెస్త వెంకటేష్, దాసరి ఆదెప్ప, తలారి నేలకోటప్ప, తలారి లక్ష్మీనారాయణ, దాసరి అశోక్, మంతి నరసింహులు, శ్రీనివాసులు, మంతి గిరిజమ్మ, కిష్టప్ప, తదితరులు టిడిపిలో చేరగా సునీత కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆమె తీవ్రంగా స్పందించారు. 'ఇసుక, మట్టి దోపిడీ చేసిందెవరో.. జాకీ పరిశ్రమ తరలిపోవడానికి కారకులెవరో ప్రజలకు బాగా తెలుసన్నారు. ఎమ్మెల్యే, ఆయన సోదరులు చేసిన దౌర్జన్యాలు, దోపిడీల వల్ల ఎన్నో కుటుంబాలు ఇబ్బంది పడ్డాయన్నారు. వారంతా టిడిపి వైపు చూస్తున్నారని, కొందరు ధైర్యంగా టిడిపిలో చేరుతుండగా, ఇంకా చాలా మందిని ఎమ్మెల్యే, ఆయన సోదరులు బెదిరించి ఆపుతు న్నారన్నారు. ఎమ్మెల్యే సోదరుల దౌర్జన్యాలు ఇకపై సాగవని హెచ్చరించారు. 4 జిల్లాల నుంచి వేలాది బస్సుల్లో ప్రజలను భయపెట్టి బలవంతంగా తరలించి రాప్తాడులో సిద్ధం సభ నిర్వహించాం న్నారు. వాపును చూసి బలుపు అనుకుంటే మీకే ప్రమాదం అని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో ఎవరి బలం ఏంటో తెలుతుందన్నారు.

పరిటాల సునీత సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

బికె పార్థసారధిని కలిసిన సవితమ్మ

బికెని కలిసిన సవితమ్మ

పెనుకొండ : పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథిని మర్యాద పూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని సవితమ్మ బికెని కోరారు. బికె మాట్లాడుతూ క్యాడర్ అందరితో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆమెకు తెలిపారు.

విదేశీ బృందం పరిశీలన

మడకశిర : ఎపిలో రైతు సాధికార సంస్థ ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయం కార్యక్రమాలను పరిశీలించేందుకు ఈజిప్ట్, యూరప్ దేశాలకు చెందిన ప్రతినిధి బృందం బుధవారం రొళ్ల మండలంలోని రత్నగిరి గ్రామంలో పర్యటించింది. ప్రతినిధులు వాల్టార్ లింక్ లూసి వాల్లేష్మెల్లిషా హెల్మి అబౌలిష్ జస్టిస్ హాని, మార్యం అబౌలిష్, అమర్ సహబీ జిల్లాలో పర్యటించారు. వారు ఘన ద్రవ జీవామృతం తయారీ, పంటల సాగులో వాటి వాడకం, వాటి ఉపయోగం, దిగుబడి, తదితర వాటిని డెమో ద్వారా తెలుసుకున్నారు. వారి వెంట రైతు సాధికార సంస్థ వైస్ ఛైర్మన్ విజయ్‌కుమార్, ప్రకృతి వ్యక్తి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మానాయక్, థిమెటిక్ లీడర్ సుధాకర్, సురేష్, ప్రవీణ్, స్మిత, స్వాతి, జిల్లా అధికారులు క్రిష్ణ చైతన్య, రీసోర్స్ పర్సన్ నరేంద్ర, భానుమతి ఉన్నారు.

'శంఖారారం' జయప్రదం చేయండి

పెనుకొండ : పట్టణంలోని మడకశిర రోడ్డులో తేజోకిరణ్ ప్లాస్టిక్ ఫ్యాక్టరీ పక్కన గురువారం సాయంత్రం నిర్వహిస్తున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం సభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ వేర్వేరుగా పిలుపునిచ్చారు.

కదిరి అర్బన్ : ఈ నెల 8వ తేదీ పట్టణంలోని పివిఆర్ కల్యాణ మండపం ఎదురుగా నిర్వహిస్తున్న నారా లోకేష్ శంఖారావం సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు.

పుట్టపర్తి అర్బన్ : ఈ నెల 8వ తేదీ కొత్త చెరువులో నిర్వహిస్తున్న నారా లోకేష్ శంఖారావం సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు.

తాగునీటి సమస్యలపై కాల్ సెంటర్

పుట్టపర్తి క్రైమ్ : జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మల్లికార్జునప్ప బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తితే ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ 08555-292439 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని, వెంటనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

భక్తుల కోసం ప్రత్యేక వాహనం

పుట్టపర్తి క్రైమ్ : ప్రశాంతి నిలయంకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు శ్రీసత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ తెలిపారు. సాయి సన్నిధికి వచ్చే వృద్ధులు, వికలాంగుల కోసం బుధవారం ఆయన గణేష్ గేటు వద్ద 12 సీట్లు గల ప్రత్యేక వాహనానికి పూజలు చేసి ప్రారంభించారు.

మహా ధ్యాన యోగేశ్వర వార్షికోత్సవ వేడుకలు

పెనుకొండ : పట్టణంలోని భోగ సముద్రం చెరువు వద్ద కొలువై ఉన్న శ్రీమహాధ్యాన యోగేశ్వరమూర్తి ఆరో వార్షికోత్సవం వేడుకలు మూడు రోజులు ఘనంగా నిర్వహిస్తున్నట్లు బిజెవిపిఎస్ పరిరక్షణ సమితి సభ్యులు పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకూ విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో బిజెవిపిఎస్ ప్రెసిడెంట్ పాపానాయుడు, ట్రెజరర్ రమేష్, సభ్యులు చంద్రమౌళి, భాను, రఘుస్వామి, రాము, యతి రాజు, త్రినాథ్, వినోద్, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఐ తీరుపై సిపిఎం ఆధ్వర్యంలో డీఎస్పీకి ఫిర్యాదు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని కంచిసముద్రం గ్రామంలో రెండు రోజుల క్రితం మురళి, గోవర్ధన్ వర్గాల మధ్య జరిగిన ఘర్షణ జరిగింది. అందులో దెబ్బలు తిన్న గోవర్ధన్ వర్గం తరపున సిపిఎం మండల నాయ కుడు రొద్దం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బాధితుల సమస్యను తెలిపారు. దీంతో ఎస్ఐ అతడిపై దురుసుగా ప్రవర్తించారు. ఈ సంఘటనపై బుధవారం సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ నాయకులతో కలిసి వెళ్లి ఎస్ఐపై పెనుకొండ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. సిపిఎం నాయకుడిపై దురుసుగా ప్రవర్తించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని, దాడికి గురైన మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. స్పందించిన డీఎస్పీ విచారించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ప్రధా న కార్యదర్శి పెద్దన్న, సిపిఎం మండల కార్యదర్శి ఫకృద్దీన్, నాయకులు నారాయణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బాబావలి, ఆటో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు తిప్పన్న, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, గంగాధర్, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు నారాయణ, లక్ష్మీనారాయణ, ఓంకార్, తిప్పన్న, బాధితులు సుజాత, మమత, రామాంజనమ్మ, గోవర్ధన్, గోపాల్ పాల్గొన్నారు.

రొద్దం ఎస్ఐపై డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, నాయకులు, బాధితులు

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

ప్రజాశక్తి-గోరంట్ల

రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం పట్టణంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. అంతకుముందు గుజరి శంకర్ ఇంటి వద్ద చరణ్‌రెడ్డికి క్రేన్ సాయంతో గజమాల వేసి స్వాగతం పలికారు. పులేరు రోడ్డులో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమం లో సర్పంచి సరోజ నాగేనాయక్, జడ్పిటిసి జయరాం నాయక్, ఉప సర్పంచి రాజారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు రఘురాంరెడ్డి, శివశంకర్‌రెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, నాయకులు హరినాథ్‌రెడ్డి, శివారెడ్డి, శంకర్‌రెడ్డి, గుజరి శంకర, చింతా రామచంద్రారెడ్డి, పద్మనాభరెడ్డి, ధనుంజయరెడ్డి, నరసింహారెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

చరణ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న సర్పంచి సరోజనాగేనాయక్

అభివృద్ధి కావాలంటే టిడిపి గెలవాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాలని పరిటాల జ్ఞాన పేర్కొన్నారు. ఆమె బుధవారం తెలుగు మహిళలు, టిడిపి శ్రేణులతో కలిసి పట్టణంలోని 13వ వార్డులో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. యాదవవీధి, బ్రాహ్మణవీధిలో జ్ఞానకు మహిళలు హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్, మినీమేనిఫెస్టో కరపత్రాలు పంపిణీచేశారు. వచ్చే ఎన్నికల్లో పరిటాల శ్రీరామ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

టిడిపి పథకాలపై కరపత్రాలు పంపిణీ

ప్రజా సేవకుడు చంద్రబాబు అని... రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు అందించాలని రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ కోరారు. పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్లు 25వ వార్డులో ఇంటింటికీ వెళ్లి టిడిపి పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబు సిఎం అయితేనే పేద ప్రజ లు సంతోషంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, శీలా మూర్తి, గోసల శ్రీరాములు, గడ్డం సూరి, రామాంజనేయులు, రవి, పూజారి పోతలయ్య, చిరంజీవి, అమర్నాథ్, క్రిష్ణ, కరెంటు ఆది, బీరే శీన, మాదన సుబ్బయ్య, మాధవరెడ్డి, నాగేంద్ర, తొగట అనిల్, వాసుదేవ, ఉస్మాన్, వీరయ్య, బాబావలి పాల్గొన్నారు.

13వ వార్డులో ప్రచారం చేస్తున్న పరిటాల జ్ఞాన

పాఠశాలలు మధ్యాహ్నం వరకే నిర్వహించాలని వినతి

కొత్తచెరువు : ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలను మధ్యాహ్నం వరకే నిర్వహించాలని కోరుతూ బుధవారం ఎస్‌టియు అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ డిఇఒ కార్యా లయంలో ఎడి నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలను వెంటనే నిర్వహించాలన్నారు. జిల్లాలో కోర్టు ఉత్తర్వులతో ఆగిపోయిన స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు ఉద్యోగోన్నతుల సమస్యను పరిశీలించి వారికి న్యాయం చేయాలన్నారు. అడ్మిషన్లు తగ్గిపోతున్న తరుణం లో 1వ తరగతి ప్రవేశ వయసు ఐదేళ్లకు తగ్గించాలన్నారు. పాఠశాలలకు గ్రాంట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివయ్య, ఉపాధ్యక్షులు సుధాకర్, జిల్లా కార్యదర్శి సంపత్ కుమార్, రవిచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత ఓటుహక్కు వినియోగించుకోవాలి

ధర్మవరం టౌన్ : ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో 'మేరా పెహలే ఓట్ దేశ్ కే లియే'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువత ఎన్నికలను అవగాహన చేసుకుని ప్రలోభా లకు లోనుకాకుండా మంచి నాయకులను ఎన్నుకుంటే మంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఒక ఓటు ఒక జీవితంతో సమానం అన్నారు. అనంతరం విద్యార్థుల చేత ఓటు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సమీవుల్లా, చిట్టెమ్మ, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, పుష్పావతి, సరస్వతి, స్వామి, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

అమరాపురం : మండలంలోని హలుకూరు గ్రామ తపాలా కార్యాలయంలో పోస్ట్‌మాస్టర్ మధుసూదన్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ నవీన్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు పోస్టల్ బ్యాంకు పొదుపు, పెట్టుబడి పథకాలు, ప్రమాద బీమాపై అవగాహన కల్పించారు. రూ. 520 వార్షిక చెల్లింపుతో రూ. 10 లక్షల బీమా పొందవచ్చని తెలిపారు.

విమానాశ్రయంలో నారా లోకేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం పుట్టపర్తి విమానాశ్రయం చేరుకున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌కు జిల్లా నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మాజీ మంత్రులు పల్లె రఘునాథ్‌రెడ్డి, పరిటాల సునీత, జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారథి, కందికుంట వెంకటప్రసాద్, పరిటాల శ్రీరామ్, సవితమ్మ, సునీల్‌కుమార్ నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. పల్లె రఘునాథ్‌రెడ్డి సత్యసాయి బాబా చిత్రపటాన్ని లోకేష్‌కు బహూకరిం చారు. స్వాగతం పలికిన వారిలో గోరంట్ల పట్టణానికి చెందిన మైనార్టీ యువ నేత, సామాజిక సేవాకర్త ఉమర్‌ఖాన్, నాయకులు అంబికా లక్ష్మీనారాయణ, బివి.వెంకటరాముడు, జస్వంత్, రాయల్ మురళి, బాలాజీ, పాండు భాను, హరి, వెంకటప్ప, సోమశేఖర్, రామంజి, ఉన్నారు. నారా లోకేష్ విమానాశ్రయంలో వెలుపల కార్యకర్తలు, నాయకులతో కరచాలనం చేసి ఆప్యాయంగా పలకరించారు.

లోకేష్‌తో కలిసి ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న నాయకులు

వైసిపితోనే గ్రామాల సర్వతోముఖాభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

గ్రామాల సర్వతోముఖాభివృద్ధి సిఎం జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బండ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, బైరాపురంలో విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయ భవనాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో సిఎం జగన్ గ్రామస్థాయిలో సచివాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి పేదవాడికి ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంతో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారన్నారు. తద్వారా గ్రామంలోనే ఉచితంగా 24 గంటలు వైద్యం అందుతుందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులు నిత్యం అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి శ్రేణులు పాల్గొన్నారు

ఆర్‌బికె భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీధరరెడ్డి

సిఎం జగన్‌తోనే మహిళా సాధికారత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సిఎం జగన్ మహిళా సాధికారతకు విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 260 మంది వైసిపిలో చేరగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ సంక్షేమ పథకాలు, స్థానిక సంస్థలతో పాటు నామినేటెడ్, కార్పొరేషన్ల పదవుల్లో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. టిడిపి పాలనలో డ్వాక్రా మహిళలను రుణమాఫీ పేరుతో మోసం చేయగా జగన్ ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ఆర్ ఆసరా ద్వారా ఏటా రుణ మాఫీ నిధులు జమ చేశారన్నారు. మహిళలంతా ఏకతాటిపై నిలిచి రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కోటిరెడ్డి బాల్‌రెడ్డి, కాంతమ్మ, రుక్సానా, గంగాభవాని, మీనాక్షి, గోవిందమ్మ పాల్గొన్నారు

'శంఖారావం' సభ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-మడకశిర

'శంఖారావం' పేరిట టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గురువారం నియోజక వర్గంలో పర్యటిస్తున్నారు. దీంతో నియోజకవర్గ అభ్యర్థి సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, తదితరులు పట్టణంలో శంఖారావం సభా స్థలంలో ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు మడకశిర సమీపంలోని చీపులేటి దగ్గర శంఖారావం బహిరంగ సభ ఉంటుంది. సభకు నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరవుతుండగా ముఖ్య నాయకులు సభా స్థలిని పరిశీలించి కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశారు. పది వేల మందికి పైగా హాజరయ్యే అవకాశం ఉందని నాయకులు తెలిపారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో కుంచిటి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం.పాండురంగప్ప, పార్లమెంట్ రైతు కార్యదర్శి ఉగ్ర నరసింహప్ప, అశ్వద్ధామప్ప, క్రిష్టప్ప, శక్తిముని, ప్రకాష్, మంజునాథ్, రామన్న, రవికుమార్, నరసేగౌడ్, రాజశేఖర్, చీపులేటి నాగరాజు ఉన్నారు.

సభా వేదికను పరిశీలిస్తున్న సునీల్‌కుమార్, ఈరన్న

సైకో జగన్‌ను సాగనంపాలి : సవితమ్మ

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావాలంటే సైకో జగన్‌ను ఇంటికి పంపాలని పెను కొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. మండలంలోని చిన్నమంతూరు గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని బుధవారం ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ అణగా రిన వర్గాల సామాజిక, ఆర్థిక సాధికారత కోసం జీవితాంతం పరితపించిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు. సామాజిక అసమానతల నిర్మూలనకు పోరాడుతూనే, అన్ని వర్గాల వారికి సమన్యాయం జరగాలనే దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. దళితులు అభివృద్ధి చెందినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్రం అన్నారు. కార్యక్రమంలో సర్పంచి రామిరెడ్డి, నాయకులు మాధవ నాయుడు, నరసింహులు, టైలర్ ఆంజనేయులు, వెంకటరామిరెడ్డి, రాము, నరేష్, తిరుపాల్‌నాయుడు, పవన్‌కుమార్, శ్రీనాథ్‌చౌదరి, క్రిష్టప్ప, కెవిపిఎస్ రమణ, ఎంఆర్‌పిఎస్ నాయకులు నల్లూరు నాగరాజు, గోపాల్, దండేపల్లి అంజనప్ప, తిమ్మయ్య, దుర్గప్ప, కదిరిప్ప, నరసింహులు, పాల్గొన్నారు.

షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

పెనుకొండ : పట్టణంలోని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్పర్సన్ శిల్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి బుధవారం అనూహ్య స్పందన లభించింది. జర్మనీ దేశానికి చెందిన ప్రముఖ వైద్యులు చెవి, ముక్కు, గొంతు, చర్మ, కంటి సంబంధిత వ్యాధులకు వైద్య సేవలు అందించారు. శిల్ప మాట్లాడుతూ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. వినికిడి లోపం ఉన్న 306 మందికి వినికిడి యంత్రాలు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో శిల్ప తండ్రి భాస్కర్‌రెడ్డి, విదేశీ వైద్యులు ఈఎన్‌టి డాక్టర్ సుసాన్నే, స్కిన్ డాక్టర్ క్రిస్టియన్, టెక్నీషియన్లు రిచర్డ్, పీటర్, ఫిజియోథెరపిస్ట్, జెఎఫ్.ఫ్రెజెన్‌రోజ్, ట్రస్ట్ సిబ్బంది చిట్టిబాబు, హరి, బాబు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో చికిత్స చేస్తున్న విదేశీ వైద్యురాలు

కందికుంట యశోదమ్మ ప్రచారం

కదిరి టౌన్ : ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం కందికుంట యశోదమ్మ మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో ప్రచారం చేశారు. ఆమె ఇంటింటికీ వెళ్లి టిడిపి ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పర్వీన్‌బాను, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్ ముస్తఫా పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

చిలమత్తూరు : మండలంలోని కందూరుపర్తి గ్రామానికి చెందిన మధువర్ధన్‌రెడ్డి(23) బుధవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలను విచారణ అనంతరం వెల్లడిస్తామని ఎస్ఐ గంగధర్ తెలిపారు.

'కుషావతి'లో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

చిలమత్తూరు : మండలంలోని కుషావతి నదిలో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. నదిలో ఇసుకను తరలించడంతో బోర్లలో నీరు అడుగంటుతున్నాయని అడ్డుకునే ప్రయత్నం చేసిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. అప్పనపల్లి సమీపంలో బుధవారం కుషావతి నదిలో తమ భూమి వద్ద ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండగా ఓ మహిళా రైతు అడ్డుకునే ప్రయత్నం చేయగా అక్రమార్కులు ఆమెను కిందకు తోసేసినట్లు బాధితురాలు వాపోయింది. ఈ సంఘటన సోషల్ మీడియాలో రావడం, ఆమె ట్రాక్టర్‌కు అడ్డుగా పడుకోవడంతో దుండగులు ట్రాక్టర్ వదిలేసి పారిపోయారు. వదిలేసి వెళ్లిన వాహనాన్ని పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

సచివాలయ ఉద్యోగుల మధ్య విభేదాలు..పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

సోమందేపల్లి : మండలంలోని తుంగోడు సచివాలయంలో బుధవారం ఉద్యోగులు ఒకరిపై ఒకరు దూషిం చుకుని ఆఖరికి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కారు. వివరాలు.. పంచాయతీ కార్యదర్శి సావిత్రి ప్రతి నెలా వేతనాలు పెట్టడంలో ఆలస్యం చేస్తుందని, డబ్బులు వసూలు చేస్తోందని ఎఎన్ఎం గీతమ్మ ఎంపిడిఒ వెంకటేశ్వరరావుకు, పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సావిత్రిని వివరణ కోరగా ఎఎన్ఎం గీతమ్మ, సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కాకపోవడమే కాకుండా విధులు సక్రమంగా నిర్వహించకుండా ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని గ్రామస్తులు తనకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయంపై ఉద్యోగులను నిలదీయగా నా మీద అభాండాలు వేస్తూ బెదిరిస్తున్నారని వారిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.